క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

రేగొండ: పొలాలను సారవంతం చేసేందుకుగాను ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తుందని మండల వ్యవసాయ అధికారి వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రసాయన ఎరువులు వేయడం వలన భూములు సారాన్ని కోల్పోతున్నాయని తెలిపారు. అందుకే ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు 60 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తోందన్నారు. రేగొండ ఆగ్రోస్ కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమున్న రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌తో మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. జీలుగ సబ్సిడీపై 30 కిలోల బస్తా రూ.1116కి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

మల్లన్నను గెలిపించాలి

చిట్యాల: వరంగల్–ఖమ్మం–నల్లొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని మండల కో–ఆప్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌మహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిరంతం పోరాడిన మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మైసమ్మ జాతరకు ఏర్పాట్లు



వాజేడు: మండల పరిధిలోని కాచారం వద్ద నేటి(శనివారం) నుంచి మైసమ్మ జాతరను నిర్వహించనున్నారు. జాతరను నిర్వహించడానికిగాను మైసమ్మ తల్లి వద్ద పనులను ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రారంభించారు. అందులో భాగంగా తల్లడి పాపారావు ఆధ్వర్యంలో చలువ పందిళ్లను వేస్తున్నారు. శనివారం ఉదయం పావన గోదావరి నుంచి పారేటి కుండల్లో గంగ జలాలను తీసుకువచ్చి మైసమ్మ తల్లికి జలాభిషేకం చేయనున్నారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు మైసమ్మకు మొక్కులను సమర్పించుకోనున్నారు.

పండ్ల పంపిణీ



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గుడాడ్‌పల్లి మాజీ సర్పంచ్ ఉడుత ఐలయ్య అతడి కుమారుడు విష్ణువర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణ కేంద్రంలోని అమృత వర్షిణీ వృద్ధ శ్రామంలో పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వహకుడు శ్యాం ప్రసాద్ ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

జోరు వర్షం



టేకుమట్ల: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో వర్షాకాలం తలపించింది. నడి ఎండాకాలంలో వర్షాకాలంలా వర్షం కురియడంతో ప్రజలు బయటికి రాకుండా ఇళ్లలోనే ఉన్నారు. వర్షానికి రోడ్ల వెంట భారీగా వరద రావడంతో వాహనదారులకు అంతరాయం ఏర్పడింది.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి



భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని నాగారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాంనేని శ్రీనివాస్ కుచెందిన కాడెద్దు మేతకు వెళ్లే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తు వైరుకు షాక్‌గురై అక్కడిక్కడే మృతి చెందిందని తెలిపారు. సుమారుగా ఎద్దు విలువ సూమరుగా రూ.80 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏటూరునాగారం: మండలంలో నేడు(శనివారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ మెంటనెన్స్ చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కంకర పోసి వదిలేసిన రోడ్డు

రేగొండ: గ్రామీణ రహదారులను మెరుగుపరిచి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు రహదారులను మంజూరు చేసింది. అందులో భాగంగానే 2021లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం రూ.4.98 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాని రేపాక నుంచి కనిపర్తి మీదుగా పరకాలకు వెళ్లే దారిలో ఉన్న బీటీ రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందిగా ప్రయాణం..

రోడ్డు సౌకర్యం లేక అనేక ఏళ్లుగా ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా ప్రభుత్వం నిధులు మంజురూ చేయడంతో కష్టాలు తీరుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే కలిగింది. పనులు ప్రారంభించిన గుత్తేదారు కంకర పోసి వదిలేశారు. 16 నెలలు గడిచినా తారు పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. రోడ్డుపై కంకరతో ప్రయాణం చేయలేక వాహనాదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పలువురు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. నిత్యం ఈ దారిగుండా చిట్యాల, టేకుమట్ల మండల ప్రజలు కూడా పరకాలకు వెళ్తుంటారు. ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకొవడం లేదని, ఇకనైన ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి సదరు గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



చెరువుకట్టపై కంకర వేసి వదిలేయడంతో అటుగుండా వెళ్లాలంటే భయమేస్తుంది. బైక్‌లు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో రాత్రివేళ బైక్‌పై బయటికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– చావటి ఐలయ్య, రేపాక

రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి



రోడ్డు నిర్మాణ పనులు గతేడాది ప్రారంభించిన ఇప్పటికి పూర్తి కాలేదు. కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– అనిల్, పరకాల

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: కూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని గ్రామీణ అభివృద్ధి శాఖ మెంబర్ సెక్రటరీ రాజారావు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కాటారం మండలం కొత్తపల్లిలో కొనసాగుతున్న వాటర్ హార్వెస్టింగ్ పనులను టెక్నికల్ మెంబర్ అబిద్‌ఖాన్‌తో కలిసి రాజారావు శుక్రవారం పరిశీలించారు. పనుల వివరాలు, కూలీల హాజరు, పని ప్రదేశంలో సౌకర్యాలపై ఆరా తీశారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పని చేస్తే రోజు రూ.300 కూలి పొందవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలికి పని కల్పించాలని ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని అధికారులకు తెలిపారు. అనంతరం వారు కాటారం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన వననర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం జాగ్రత్తగా చేపట్టాలని ప్రైమరి బెడ్ మీద ఉన్న నారును ఖాళీ బ్యాగుల్లో నాటాలని పేర్కొన్నారు. డిమాండ్ ప్రకారం మొక్కలు పెంచాలని బెడ్ వారిగా మొక్కల వివరాలు రాసి నేమ్‌బోర్డ్స్ పెట్టించాలని ఆదేశించారు. మెంబర్ సెక్రటరీ వెంట అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి, ఏపీడీ మంజుల దేవి, ఎంపీడీఓ బాబు, ఏపీఓ వెంకన్న, ఇన్‌చార్జ్ ఈసీ శ్రీనివాస్, టీఏ రవళి, పంచాయతీ కార్యదర్శులు జ్యోత్స్న, షగీర్‌ఖాన్ ఉన్నారు.

రహదారి మరమ్మతు పనులు



దెబ్బతిన్న రోడ్డును తొలగిస్తున్న పొక్లెయినర్

వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, మొరుమూరు కాలనీ గ్రామాల మధ్య శుక్రవారం రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. వాజేడు, భద్రాచలం రహదారికి మరమ్మతుల కోసం గతంలోనే నిధులు మంజూరయ్యాయి. కాగా, పనులను కొంతమేర చేసి నిలిపివేశారు. తిరిగి శుక్రవారం నుంచి రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. రహదారి దెబ్బతిన్న చోట తొలగించి కొత్తగా రహదారిని వేస్తున్నారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు



తనిఖీ చేస్తున్న ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్

ఏటూరునాగారం: రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. ఏటూరునాగారం నుంచి ముళ్లకట్ట వరకు ఎస్సై సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో 163 జాతీయ రహదారిపై 66 ఇసుక లారీలు నిలిపివేయడంతో వారి నుంచి రూ.75485ల జరిమానాలను విధించారు. అదేవిధంగా డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు కూడా చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేశామన్నారు. డ్రైవర్లు ఆర్‌టీఏ నిబంధనలను పాటించాలన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్స్ సదానందం, గోపి, శ్రీనివాస్, అజయ్, లక్ష్మణ్ నాయక్ ఉన్నారు.


పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ములుగు ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి పరిశీలించారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగు నీరు, తదితర సౌకర్యాలు ఉన్నది లేనిది పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మేఘావృతమైన ఆకాశం



జంపన్నవాగు వద్ద కారుమబ్బులు

- ఏజెన్సీలో వర్షం
- అల్లాడుతున్న అన్నదాతలు



చిన్నబోయినపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యం

ఏటూరునాగారం: వేసవికాలంలో అకాల వర్షంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం ఏజెన్సీలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో ఆకాశం నీలిరంగుగా మారి మేఘావృతమై కనిపించింది. ఆహ్లాదాన్ని పంచే విధంగా ఉన్నప్పటికీ వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు కుదేలు అవుతున్నారు. వర్షాలతో వారు పండించిన పంటలను కాపాడుకోవడానికి నరకయాతన పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు పడుతున్నారు. వర్షం ఏ క్షణంలో అయినా కురుస్తుందని కంటిమీద కునుకులేకుండా కాపల కాస్తున్నారు. వర్షం కురుస్తుండడంతో ఆరుగాలం పండించిన ధాన్యం తడిస్తే మళ్లీ మొలకలు వస్తాయని భయాందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు తమకేమి పట్టనట్టుగా ఉండడంతో రైతులే అన్ని రకాలుగా కష్టాలు పడుతున్నారు. పెద్ద ఎత్తున గోదాములను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలను అక్కడే ఏర్పాటు చేయాలని మాజీ ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అప్రమత్తత అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ లక్షణ్

కన్నాయిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానిక వైద్యులు అభినవ్ అన్నారు. శుక్రవారం రాజన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామంలో స్థానిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 52 మందికి ఓపీ చూడగా అందులో 8మందికి జ్వరం ఉందని, 22మందికి ఆర్‌డీటీ పరీక్షలు చేశామని ఎలాంటి పాజిటివ్ లేవని తేలినట్లు అధికారులు తెలిపారు. 30 మందికి బాడీ పేన్స్ ఉన్నట్లు తేలిందని తెలిపారు. ఈ కార్యమంలో హెల్త్ అసిస్టెంట్ లక్షణ్, ఆశవర్కర్లు పాల్గొన్నారు

గాలొస్తే కరెంట్ బంద్

మంగపేట: చిన్న పాటి గాలివీచినా నాలుగు చినుకుల వర్షం పడినా మండలంలోని నర్సింహాసాగర్‌కు కరెంటు సరఫరా పూర్తి నిలిచి పోతుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలో గురువారం సాయంత్రం వచ్చిన గాలివానకు సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం 08 గంటల వరకు పూర్తిగా కరెంటు సరఫరా నిలిచి పోవడంతో నరకాన్ని చవిచూశామని పలువురు వాపోయారు. ట్రాన్స్‌కో అధికారులు జామాయిల్ తోటల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సాకులు చెప్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో తరచుగా అంతరాయం కలుగకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

దగ్ధమైన తోట పరిశీలన



బాధితుడితో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నిమ్మల ఉషాలుకు చెందిన ఆయిల్ పామ్ తోట దగ్ధమైనది. కాగా, శుక్రవారం దగ్ధమైన ఆయిల్ పామ్‌ను భూపాలపల్లి డివిజన్ ఉద్యాన శాఖ అధికారి సునీల్ కుమార్ పరిశీలించారు. తోట కాలిపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రాథమిక విచారణ చేపట్టి జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకపోయి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు. కాగా మిగిలిన మొక్కల సంరక్షణ పద్ధతులు రైతుకు వివరించినట్లు తెలిపారు. ఆయన వెంట ఆయిల్ పామ్ నర్సరీ మేనేజర్ గవాస్కర్, ఫినోలెక్స్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి రజినీకాంత్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

చిట్యాల: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రిన్సిపాల్ శరదృతి తెలిపారు. శుక్రవారం మండలంలోని జడల్‌పేట, అందుకుతండాతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం జరిగిందని అన్నారు. అలాగే కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ఉన్నాయని తెలిపారు. కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం, పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం లాంటివి ఇక్కడి ప్రత్యేకత అని అన్నారు. అలాగే సైన్స్ విద్యార్థులకు ఎంసెట్‌లో ఏ ర్యాంకు సాధించిన వారికైనా ఇంజనీరింగ్, ఫార్మసీలో ఉచిత విద్య, ఉచిత అడ్మిషన్ , విద్యాబోధన ఉంటుందన్నారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చలర్లు కర్ణాజీ, శ్రీనివాస్, బాలకృష్ణ, సురేష్, తిరుమలరావు, ఉమాదేవి, రమేష్ , యుగేందర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

బీపీపై అప్రమత్తంగా ఉండాలి



బీపీ గ్రేడ్‌లను వివరిస్తున్న డాక్టర్ ఆశాజ్యోతి

టేకుమట్ల: ప్రతి ఒక్కరూ బీపీపై అప్రమత్తంగా ఉండాలని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. శుక్రవారం ప్రపంచ బీపీ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన వారికి బీపీ పరీక్ష చేసి, బీపీ నార్మల్, గ్రేడ్1, 2, 3లను వివరిస్తూ, బీపీపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ప్రతీ ఆరు నెలలకొకసారి తప్పనిసరిగా బీపీని చెక్ చేసుకోవాలన్నారు. బీపీ నార్మల్‌గా, బీపీ గ్రేడ్ 1లో ఉన్న వ్యక్తులు బీపీ కంట్రోల్‌లో ఉండేందుకు ఆహార నియమాలు పాటించాలన్నారు. గ్రేడ్ 2,3 వారు నిత్యం తీసుకునే ఆహారంలో ఉప్పు శాతాన్ని, మాంసాహారాన్ని తగ్గించి, శాఖాహారానికే ప్రాధాన్యత ఇవ్వాలని, చేపలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. బీపీ గ్రేడ్ 2,3 లో ఉన్న వారికి బ్రెయిన్‌స్ట్రోక్, గుండెపోటు, తలలో నరాలు చిట్లే ప్రమాదం ఉంటుందని నిత్యం వ్యాయామం చేస్తూ, ఎక్కువగా కూరగాయలు, పండ్లు, నీటిని ఎక్కువగా తీసుకోవాలన్నారు. మందులను వాడుతూ బీపీ నుంచి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధురిమ, ఫార్మసిస్టు విద్యాసాగర్, స్టాఫ్ నర్సు చిత్ర, ఏఎన్ఎం రేణుక, శిరాషా, డీఈవో రమేష్, సిబ్బంది కిష్టస్వామి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: రైతు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహ అన్నారు. శుక్రవారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అకాల వర్షాలకు కల్లాలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూరపనేని రవీందర్, సాంబశివరావు, రాకేష్, హనుమంతరావు, శ్రీనివాసరావు, రవి, లింగయ్య, లక్ష్మణ్, వెంకటేశ్, కృష్ణ, రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు.

'బాధలు ఎవరికి చెప్పకోవాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ మహిళలు

ఏటూరునాగారం: గిరిజనుల సమస్యలను, మహిళల ఇబ్బందులను ఐటీడీఏ పీఓ తెలుసుకోవడం లేదని, తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని ఆదివాసీ మహిళా సంఘం నేత శమంతకమణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఆమె మహిళా సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి కోసం, వారి సంరక్షణ కోసం చట్టాలు, జీఓలు హక్కులను కాపాడడం కోసం ప్రత్యేకంగా గిరిజన అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి, సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అధికారాలను ఇచ్చి, వాటిని అమలు చేయడం కోసం ఐఏఎస్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. గిరిజనులకు పీఓ అందుబాటులో ఉండడం లేదని అన్నారు. ఇద్దరు గిరిజనేతర డైలీ వేజ్ ఉద్యోగులను పెట్టుకొని వారికి దరఖాస్తు ఇచ్చి వెళ్లండి అనడం, మేము పీఓను కలవడానికి ఎంత ప్రయత్నం చేసినా కలవకపోవడం తమ బాధలను వినకపోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోయం రత్న, సోయం సత్యమ్మ, వాసం భవాని, వాసం జమున, గొంది గౌరమ్మ, యాలం దేవి, సోయం లక్ష్మీ, తల్లడి విజయ, పీరీల సుమలత, సోలం కమల, ఈసం జమున, బడే లలిత, కోడిపా లక్ష్మీ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామ కూడలి వద్ద శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు, గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కంకర తెలిన రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఇదే రోడ్డుపై ప్యాచ్‌వర్క్ చేసిన అధికారులు ఇక్కడ చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిత్యం వాహనాదారులు, ప్రజలు తిరిగే మూలమలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కనీసం సంబంధిత అధికారులు పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.